
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం : 30 : జూన్ : 2025



సోమశిలలో 32.515 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారానికి 32.515 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 3,330, ఉత్తర, దక్షిణ కాలువలకు 1275 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.98,720
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,930
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,200
సవర (8 గ్రాములు)	రూ.73,600

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.7 /30.1

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. ఆదివారం గాలిలో తేమ 42 శాతం నమోదైంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ నేతలపై ఏకపక్ష కేసులు

- విచారణకు హాజరు కావాలని పోలీసుల నోటీసులు

చేజర్ల (ఆత్మకూరు): మండలంలోని యనమదలకు చెందిన సర్పంచ్ నోటి సుందరరామిరెడ్డి ఆయన బంధువులు రవి తదితరులపై గతంలో ఏకపక్షంగా నమోదు చేసిన కేసులో విచారణ నిమిత్తం స్టేషన్‌కు హాజరు కావాలని శనివారం సాయంత్రం ఎస్సై తిరుమలరావు నోటీసులు జారీ చేశారు. వాస్తవానికి గతేడాది అక్టోబరులో కట్టిన ఈ కేసు మేరకు అప్పటి ఎస్సై ప్రభాకర్ రావు వైఎస్సార్‌సీపీ వారిపై కేసులు నమోదు చేశారు. ఈ ఘటనకు కారణమైన తిరుపతిరెడ్డిపై తాము ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని బాధితులు తెలిపారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ 10న సర్పంచ్ సుందరరామిరెడ్డి ఇంటికి వచ్చి తిరుపతిరెడ్డి తదితరులు దూషించడంతో అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, మరుసటి రోజు 11వ తేదీ తమపై ఎదురు పక్షం ఫిర్యాదు చేయగానే కేసు కట్టారని బాధితులు వాపోయారు. రాజకీయ కక్షలతోనే ఇలా కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై తిరుమలరావును వివరణ కోరగా ప్రస్తుతం ఇచ్చిన నోటీసులు గత ఎస్సై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ మేరకే ఇచ్చామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ జరిగిన ఘటనకు సంబంధించి తనకు సర్పంచ్ సుందరరామిరెడ్డి ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, తిరుపతిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదును పూర్తిగా పరిశీలించి సీసీ కెమెరాలను పరీక్షించిన తర్వాతనే ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వివరించారు.

సర్వేపల్లి రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధం



వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధిస్తున్నట్లు మత్స్యశాఖ సహాయ పరిశీలకులు ఏ పాట్టియ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లి చేప గుడ్డు దశలో ఉన్నందున జూలై ఒకటో తేదీ నుంచి ఆగస్టు 31 తేదీ వరకు (రెండు నెలలు) రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లకూడదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి

నెల్లూరు (పొగతోట): జెడ్పీ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు ఆదివారం జెడ్పీ కార్యాలయానికి చేరాయి. సీతారామపురం, కొడవలూరు, వెంకటాచలం ఎంపీడీఓ కార్యాలయాల్లో పనిచేస్తున్న సయ్యద్ ఖలీల్ అహ్మద్, జి.అమర్, టి.రామకృష్ణలకు ఉద్యోగోన్నతి లభించింది. ఏపీఎంఈఏ నెల్లూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్కాకుల పెంచలయ్య, దేవ ప్రసన్నకుమార్ అభినందనలు తెలిపారు.



మండుటెండలో జాతీయ రహదారిని దిగ్బంధించిన మహిళా రైతులు



జాతీయ రహదారిపైకి భారీగా తరలివచ్చి, రాస్తారోకో చేస్తున్న రైతులు



రైతులను రాస్తారోకోకు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

భూసేక రణం

భూసేకరణకు వ్యతిరేకంగా కదం తొక్కిన కర్షకులు

కాడి కట్టి.. మేడి పట్టే కర్షకులు కన్నెర్ర జేశారు. పారిశ్రామికాభివృద్ధి పేరుతో పచ్చని పంట పొలాలను లాక్కుంటే భవిష్యత్ తరాలకు అన్నం దొరకని పరిస్థితి ఏర్పడుతుందంటూ 'సేవ్ కరేడు' పేరుతో ఉద్యమించారు. పోలీసుల ముందస్తు ఆంక్షలు, అరెస్టులతో అన్నదాతల్లో కట్టలు తెంచుకున్న ఆగ్రహం పెల్లుబుకింది. పోలీసులు బారికేడ్లను పెట్టి, గ్రామాల రహదారులను దిగ్బంధించినా రైతన్నల ఆశయాన్ని ఆపలేకపోయింది. ఆదివారం పార్టీలకు అతీతంగా జాతీయ రహదారిని దిగ్బంధించి కర్షకుల శక్తిని చాటి చెప్పారు. రైతుల ఆకాంక్షలు, అభిప్రాయాలతో పనిలేకుండా ప్రభుత్వం మొండిగా భూసేకరణ చేస్తే మూకుమ్మడి ఆత్మహత్యలకు పాల్పడుతామంటూ హెచ్చరించారు.



పోలీసుల తీరుపై మహిళా రైతుల ఆగ్రహం

- అడ్డుకోలేకపోయిన పోలీసుల ఆంక్షలు, ముందస్తు అరెస్టులు
- కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో జాతీయ రహదారి దిగ్బంధం
- పోలీసులు, రైతులకు మధ్య తోపులాట
- పోరాటానికి మద్దతిచ్చిన ప్రజాసంఘాలు
- పార్టీలకతీతంగా తరలివచ్చిన రైతులు

ఉలవపాడు: రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా పరిశ్రమల కోసం బలవంతంగా చేపడుతున్న భూసేకరణ రణరంగంగా మారుతోంది. వ్యవసాయమే జీవనాధారమైన తమ పచ్చని పంట పొలాలను ఆయిల్ కంపెనీ, ఇండోసోల్ కంపెనీకి ధారాదత్తం చేయడాన్ని అన్నదాతలు జీర్ణించుకోలేకపోయారు. ఎన్ని కష్టాలు వచ్చినా.. నష్టాలు ఎదురైనా ప్రాణంకంటే మిన్నగా చూసుకునే పంట భూములను ప్రభుత్వమే బలవంతంగా లాక్కుంటే భవిష్యత్ పరిణామాలు ఏమిటని ప్రశ్నించుకున్న కరేడు గ్రామ రైతులు తమ భూములు కాపాడుకోవడానికి 'సేవ్ కరేడు' పేరుతో కలెక్టర్ ఆనంద్, సబ్‌కలెక్టర్ శ్రీపూజకు ఇప్పటికే వినతిపత్రాలు అందించారు. వీరి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆదివారం రాస్తారోకో చేసి ప్రభుత్వానికి తమ గోడు వెలిబుచ్చాలని నిర్ణయించుకున్నారు.

ముందస్తు అరెస్టులు, గ్రామ రహదారులు దిగ్బంధం

రైతులు ఆందోళన బాట పట్టనున్న నేపథ్యంలో రోడ్డెక్కడానికి వీల్లేదంటూ పోలీసులు ముందుస్తు ఆంక్షలు విధించారు. కేసులు పెట్టి అరెస్టులు చేస్తామని బెదిరింపులు చేశారు. రైతు నాయకులుగా ఉన్న వారికి నోటీసులు అందించారు. అయినా రైతులు లెక్క చేయకపోవడంతో భూ సేకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న మిరియం శ్రీనివాసులును ముందస్తుగా కేసు పెట్టి అరెస్ట్ చేశారు. ఆదివారం ఉదయం జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసులు దాదాపు 300 మంది జాతీయ రహదారి దిగ్బంధం చేసే కరేడు ర్యాంపు ప్రాంతానికి చేరుకున్నారు. కరేడు గ్రామానికి వెళ్లే దారులను బారికేడ్లతో మూసివేశారు. ఎక్కడా ఎవరూ కదలకుండా గ్రామాల్లో పికెట్లు కూడా ఏర్పాటు చేశారు. తమ భూమి తీసుకుంటూ తమ గోడు ప్రజలకు, ప్రభుత్వానికి అర్థమయ్యేలా చేస్తున్న శాంతియుత ఆందోళనను అడ్డుకోవడంపై అన్నదాతల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గ్రామంలో రైతులతో పాటు మహిళలు సైతం తమ భూముల కోసం పోలీసుల లాఠీ దెబ్బలు పడినా.. ప్రాణాలు పోయినా సరే అంటూ దండులా సుమారు 2 వేల మంది రైతులు ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లలో రామకృష్ణాపురానికి వచ్చేశారు. అక్కడా పోలీసులు భారీగా మోహరించారు.

రైతులు, పోలీసుల మధ్య తోపులాట

దాదాపు 2 వేల మంది రైతులు ఒక్కసారిగా తరలి రావడంతో పోలీసులు, రోప్‌పార్టీ, బారికేడ్లు అడ్డంగా పెట్టి నిలువరించే ప్రయత్నం చేశారు. మహిళా రైతులు ముందుగా నిలబడి తమ పొలాలు తీసుకుంటున్నారని మా బాధను మేము తెలియజేస్తుంటే మీరెందుకు ఆపుతున్నారని పోలీసులను ప్రశ్నించారు. దాదాపు అర్ధగంట పాటు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ముందుకెళ్లేందుకు దూసుకొచ్చిన రైతులు, వారిని అడ్డుకున్న పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. మహిళా రైతులు పోలీసుల బారికేడ్లను నెట్టివేసి ముందుకు దూసుకు వచ్చేశారు. కొందరు పక్కనే పొలాల్లో దూకి నడుచుకుంటూ వచ్చేశారు. తరువాత ఉన్న రైతులను నిలువరించారు. ఈ సమయంలో మళ్లీ తోపులాట జరిగింది. మహిళా రైతులతోపాటు గ్రామస్తులు కూడా రావడంతో పోలీసులు వారిని ఆపలేకపోయారు.



కాంగ్రెస్ నాయకురాలు పద్మశ్రీతో పోలీసులతో వాగ్వాదం

జాతీయ రహదారి దిగ్బంధం

భారీగా తరలి వచ్చిన రైతులు తమకు ఇండోసోల్, బీపీసీఎల్ కంపెనీలు వద్దు, మా భూములు ఇవ్వమంటూ నినాదాలు చేశారు. 'సేవ్ కరేడు' ప్లకార్డులు పట్టుకుని చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిని దిగ్బంధించారు. దాదాపు 20 నిమిషాల పాటు హైవేపై ఇరువైపులా సుమారు 5 కి.మీ. మేర వాహనాలు నిలిచిపోయాయి. రైతులు దాదాపు 2 వేల మంది హాజరు కావడంతో పోలీసులు ఏమీ చేయలేక ఉండిపోయారు.

రైతులపై పోలీసుల జులుం గర్హనీయం

- చిరసాని కోటిరెడ్డి

నెల్లూరు (అర్బన్): జిల్లాలోని ఉలవపాడు మండలం కరేడు గ్రామ రైతులపై ఆదివారం పోలీసులు ప్రదర్శించిన జులుం గర్హనీయమని ఏపీ రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రపంచ ప్రఖ్యాత గాంచిన ఉలవపాడు మామిడి తోటలు 1000 ఎకరాలతోపాటు 8,350 ఎకరాల పంట పొలాలను ఇండోసోలార్ సంస్థకు కేటాయించడాన్ని నిరసిస్తూ అక్కడి రైతులు శాంతియుతంగా నిరసన చేస్తుంటే పోలీసులు నిరంకుశంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. పోలీసుల దౌర్జన్యాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ కారును ధ్వంసం చేయడం సిగ్గు చేటన్నారు. అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా 8,350 ఎకరాల భూములను కోల్పోతున్న కరేడు రైతులతో మాట్లాడి వారి అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలన్నారు. చిన్న, సన్న కారు రైతులను కాపాడాలని కోరారు.

ఈ పోరాటం ఆరంభం మాత్రమే..

భూకరణకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన రాస్తారోకో ఆరంభం మాత్రమే అని, ప్రభుత్వం ఆలోచనా ధోరణి మారకపోతే ఉద్యమం తీవ్ర రూపం దాల్చుతుందని హెచ్చరించారు. ఆందోళనకు పార్టీలకు అతీతంగా రైతులు, గ్రామస్తులు, మహిళలు దాదాపు 2 వేల మంది తరలివచ్చారు. పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టి నిర్బంధించినా రోడ్డెక్కి తమ నిరసన ను తెలియజేశారు. రైతుల ఉద్యమాన్ని ఆదిలోనే అడ్డుకోవాలన్న పోలీసులు రైతుల ఆగ్రహం చూసి వారిని అడ్డుకోలేక చేతులెత్తేశారు.



సీపీఎం నాయకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

రైతులతో సబ్ కలెక్టర్, తహసీల్దార్ చర్చలు

జాతీయ రహదారిని రైతులు దిగ్బంధించడంతో ఎట్టకేలకు దిగొచ్చిన సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, తహసీల్దార్ శ్రీనివాసరావు చర్చలు జరిపారు. రైతులు తమ భూములిచ్చే ప్రసక్తే లేదని విస్పష్టంగా తేల్చి చెప్పేశారు. ఎలాంటి గ్రామ సభ నిర్వహించకుండా నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రైతులకు న్యాయం చేస్తామని, రాస్తారోకోను విరమించాలని రైతులు, నాయకులకు విజ్ఞప్తి చేశారు. రైతుల ఆవేదనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

ప్రజా సంఘాల మద్దతు

భూసేకరణకు వ్యతిరేకంగా కరేడు రైతులు చేస్తున్న రాస్తారోకోకు ప్రజా సంఘాలు, పలు పార్టీలు మద్దతు ప్రకటించి కార్యక్రమంలో పాల్గొన్నారు. సంఘీభావం చెప్పేందుకు వచ్చిన సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, కుమార్‌ను ర్యాంపు వద్దకు రాగానే అదుపులోకి తీసుకున్నారు. రైతుకూలీ సంఘం నాయకులు ఆర్.మోహన్ రైతులతో కలిసి పోరాటంలో పాల్గొన్నారు. బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ రాస్తారోకోలో రైతులతోనే ఉండి అండగా నిలిచారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సుంకర పద్మశ్రీ కరేడు ర్యాంపు వద్దకు రావడంతో ఆమెతో పోలీసులు దురుసుగా ప్రవర్తించి అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు.

ఆగని దందా.. ఆపే దమ్ముందా

- అనంతవరం, ఉలవపాళ్ల, కేకేగుంట గ్రావెల్ గనులు
- విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలు, రవాణా
- మీడియా ఘోషిస్తున్నా.. చెవికెక్కించుకోని అధికార యంత్రాంగం
- భారీ వాహనాల బరువుకు దెబ్బతింటున్న రహదారులు, వంతెనలు, చెరువు కలుజులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కావలి నియోజకవర్గంలో అధికార మదంతో టీడీపీ నేతలు సహజ వనరుల దోపిడీని అవిశ్రాంతంగా సాగిస్తున్నారు. గనులను తలపించే రీతిలో గ్రావెల్, మట్టిని విచ్చలవిడిగా తవ్వేసి అక్రమంగా రవాణా చేస్తున్నా.. అడిగే ధైర్యం, ఆపే దమ్ము అధికార యంత్రాంగానికి లేకుండా పోతోంది. అధికార పార్టీ నేతల రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఎక్కడ బలి కావాల్సి వస్తుందోనని తమ్ముళ్ల దందాలో వాటాలు తీసుకుంటూ ధ్రుతరాష్ట్రుల్లా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలు భవిష్యత్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులకు దారితీస్తున్నాయని భూగర్భ, వాతావరణ పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరి ధన దాహానికి రహదారులు, కల్వర్టులు, వంతెనలతోపాటు చెరువు కట్టపై కలుజులు దెబ్బతింటున్నాయి. భవిష్యత్‌లో భారీ వానలు వస్తే చెరువు కట్టలు తెగి ఊర్లకు ఊర్లనే ముంచే ప్రమాదఘంటికలు పొంచి ఉన్నాయి.



ఉలవపాళ్ల జాతీయ రహదారి సమీపంలోనే గ్రావెల్ తవ్వకాలు

గుట్టలు కరిగి.. గుంతలేర్పడి..

జిల్లాలో అత్యంత నాణ్యత కలిగిన గ్రావెల్ గనులు దగదర్తి మండలంలో ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా ఉలవపాళ్ల, కొత్తపల్లి కొరుగుంట, అనంతవరం ప్రాంతాల్లోని గ్రావెల్‌ను మైనింగ్ శాఖ అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా తవ్వేసి అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఈ మండలంలోని టీడీపీ నేతలు ఈ ఏడాది కాలంలోనే రూ.కోట్లకు పడగలెత్తారంటే ఏ స్థాయిలో అక్రమ దందా జరుగుతుందో అర్థమవుతోంది. చెరువులు, ప్రభుత్వ భూములు, కొండలు, తిప్పలు తేడా లేకుండా తవ్వేసి రూ.కోట్లలో గ్రావెల్ దందా సాగిస్తున్నారు. అటు బోగోలు, కావలి, కొడవలూరు నుంచి నెల్లూరు వరకు కొత్తగా ఏర్పాటవుతున్న లేఅవుట్లకు, రహదారులకు అవసరమైన గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఉంది. దీంతో అధికార దమ్ము, ధైర్యంతో బహిరంగంగానే గ్రావెల్ తరలించి జేబులు నింపుకుంటున్నారు. రేయింబవళ్లు విచ్చలవిడిగా గ్రావెల్ తరలిస్తున్నా అధికారులు మాత్రం తమ్ముళ్లు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తి పడి కిమ్మనడం లేదు.

- దగదర్తి మండలంలోని అనంతవరం, ఉలవపాళ్ల నుంచే అత్యధికంగా నెల్లూరువైపు గ్రావెల్ తరలివెళ్తోంది. దగదర్తిలో స్థిరపడిన అధికార పార్టీ నేత మట్టి దందాకు కీలకంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ఇటీవల ఇఫ్కో భూముల్లో పాగా వేసి గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకున్నారు. తాజాగా అనంతవరం చెరువును చెరపడుతున్నారు. చెరువులో నీరు తగ్గడంతో గ్రావెల్ తవ్వకాలు చేస్తూ చెరువు స్వరూపాన్నే మార్చేశారు. ఇప్పటికే దాదాపు 5 లక్షల క్యూబిక్ మీటర్లు మట్టిని తరలించినట్లుగా స్థానికులు చెబుతున్నారు. ఉలవపాళ్లలో జాతీయ రహదారి వెంబడే ఉన్న భూములను కబ్జా చేసి గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. హైవే పక్కనే బరితెగించి దోపిడీ చేస్తున్నా.. అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.



అనంతవరం- నారాయణపురం వెళ్లే రోడ్డు

రహదారులు విధ్వంసమా!

అల్లూరు రోడ్డు నుంచి అనంతవరం మీదుగా నారాయణపురం వెళ్లే రోడ్డు గ్రావెల్ వాహనాలతో పూర్తిగా విధ్వంసమైంది. గ్రావెల్ మాఫియా స్వార్థానికి ప్రధాన రహదారులు ఛిద్రమైపోతున్నాయి. రెండేళ్ల కిందటే వేసిన రోడ్డులు సైతం ధ్వంసమవుతున్నాయి. మరో వైపు ప్రభుత్వానికి చెల్లించాల్సిన మైనింగ్ రాయల్టీలు ఫీజులు చెల్లించకపోవడంతో ఆదాయానికి గండిపడుతున్నా.. అధికారులు మొద్దు నిద్ర వీడడం లేదు. అనంతవరం చెరువు కలుజు కూడా దెబ్బతింది. ఆ కలుజు నుంచే తూము ద్వారా నీరు సరఫరా జరుగుతోంది. దాదాపు 150 ఎకరాలు ఆయుకట్టుకు నీరందించే ఆ తూము ధ్వంసం అవుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్డీఓకు ఫిర్యాదు చేసినా.. చర్యలు శూన్యం

దగదర్తి మండలంలోని అనంతవరంలో జరిగే అక్రమ గ్రావెల్ రవాణాతో రహదారులు ఛిద్రమైపోతున్నాయిని, కల్వర్టులు, తూములు దెబ్బతిని సాగునీటి పారుదల వ్యవస్థ నిలిచిపోతుందని అనంతవరం గ్రామ రైతులు ఇటీవల కావలి ఆర్డీఓ, దగదర్తి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వీరికి వామపక్ష పార్టీ నేతలు మద్దతు ఇచ్చారు. కానీ వారు చర్యలు చేపట్టకపోవడంతో మట్టి మాఫియా లెక్క చేయలేదు. వాహనాల రణధ్వనులతోపాటు రోడ్లపై దుమ్ముధూళితో స్థానికులు నరకం అనుభవిస్తున్నారు. గ్రావెల్ మాఫియా ధనార్జన కోసం ఇష్టానుసారంగా చేస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజాగ్రహం పెల్లుబుకుతుంది.

క్లుప్తంగా

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

• డ్రైవర్ మృతి


ఘటన స్థలంలో మృతదేహం

మనుబోలు: ట్రాక్టర్‌ను లారీ ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి పొట్టు లోడుతో నాయుడుపేట వెళ్లిన ఓ ట్రాక్టర్.. తిరిగి బయల్దేరింది. ఈ క్రమంలో వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద వెనక వస్తున్న లారీ ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిన ట్రాక్టర్ డ్రైవర్ శ్రీనివాసులు(50) పైనుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహం నుజ్జునుజ్జయింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

ఉదయగిరి: యువతి అదృశ్యమైన ఘటన పట్టణంలోని రోజ్‌దార్ వీధిలో చోటుచేసుకుంది. వివరాలు.. ఉద్యోగ యత్నాల్లో ఉన్న యువతి స్థానిక సెయింట్ మేరీస్ స్కూల్‌కు వెళ్లారు. తిరిగి రాకపోవడంతో పోలీసులకు తల్లి ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయాల్లో బదిలీలలు

ఎమ్మెల్యేల సిఫార్సులకే పెద్దపీట

- లేఖల కోసం ఉద్యోగుల పరుగులు
- అధికార అండ ఉంటే అనుకున్న చోట.. లేకపోతే మరెక్కడో

ఉదయగిరి: గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థకు గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేశారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను కల్పించి.. వారికి సొంత మండలాల్లోనే పోస్టింగ్‌లిచ్చారు. ఈ తరుణంలో గతేడాది కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థను గందరగోళంగా మార్చింది. తాజాగా వీరిలో ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని బదిలీ చేసేందుకు జీఓను జారీ చేసింది. ఈ మేరకు ఉద్యోగులు తమ ప్రాధాన్యాన్ని ఆన్‌లైన్లో ఎంపిక చేసుకున్నారు. బదిలీలు పూర్తి చేసేందుకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

విచిత్ర వైఖరి

వాస్తవానికి కౌన్సెలింగ్‌ను నిర్వహించి.. మెరిట్ అధారంగా బదిలీలు చేపట్టాలి. అయితే దీనికి భిన్నమైన వైఖరిని కూటమి ప్రభుత్వం అవలంబిస్తోంది. ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల ఆధారంగా బదిలీలు జరపనున్నారు. ఈ తరుణంలో ఇవి ఉంటేనే కోరుకున్న చోట నియమిస్తామని అధికారులు తేల్చిచెప్పారు. ఈ పరిణామాల క్రమంలో వీటి కోసం అధికార పార్టీ నేతల ఇంటి చుట్టూ ఉద్యోగులు ప్రదక్షిణలు చేస్తున్నారు. వారి దయ లేకపోతే జిల్లాలోని ఏ మారుమూల ప్రాంతంలో ఉద్యోగం చేయాల్సి వస్తుందోనని పలువురు కంగారు పడుతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 769 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. వీటి పరిధిలో 8,239 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 78 మంది పంచాయతీ కార్యదర్శులకు ఇటీవల గ్రేడ్ – 4 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించి పోస్టింగ్‌లను ఇచ్చారు. వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన, ఆరోగ్య శాఖల్లో పనిచేసే కొందరికీ పదోన్నతులు లభించాయి. ప్రక్షాళన పేరిట ప్రతి సచివాలయ పరిధిలో జనాభా సంఖ్య ఆధారంగా ఉద్యోగుల సంఖ్యను ఇప్పటికే కుదించారు. దీంతో అనేక మంది ఉద్యోగులు మిగిలిపోనున్నారు. వీరికి ఎక్కడ పోస్టింగ్‌లు ఇస్తారో అంతుచిక్కడంలేదు. మరోవైపు వార్డు సచివాలయ ఉద్యోగులకు స్థానికత (సొంత మండలం)ను తొలగించలేదు. అదే గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న వారికి సొంత మండలాల్లో పోస్టింగ్‌లు ఇవ్వకుండా జీఓ జారీ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని తప్పుబడుతున్నారు. అయినా సర్కార్ పట్టించుకోకపోవడం వీరి ఆగ్రహానికి కారణమవుతోంది.



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సచివాలయ ఉద్యోగుల ఆందోళన


గ్రామ సచివాలయం

పారదర్శకతకు పాతర

బదిలీలకు సంబంధించి ఎమ్మెల్యేలిచ్చిన సిఫార్సు లేఖలను ఇప్పటికే చాలా మంది ఉద్యోగులు ఆయా శాఖల ఉన్నతాధికారులకు అందజేస్తున్నారు. కొంతమంది ప్రజాప్రతినిధులు ఇప్పటికే జాబితాను పంపారు. ఇవి లేని వారు తమను మెరిట్ ప్రాతిపదికన బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఉదంతంలో పారదర్శకతకు ప్రభుత్వం పాతరేస్తోందని ఆరోపిస్తున్నారు.

మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలకు అవకాశం

నెల్లూరు సిటీ: జిల్లాలో ఐదేళ్ల సర్వీస్‌ను పూర్తి చేసిన గ్రామ / వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు.. ప్రత్యేక కేటగిరీలో ఉన్న వారు.. రిక్వెస్ట్ నిమిత్తం బదిలీలు కోరేందుకు అవసరమైన వివరాలతో కూడిన ఆప్షన్ ఫారాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం సమర్పించాలని పోలీస్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సొంత మండలం లేదా ప్రస్తుతం పని చేస్తున్న సచివాలయంలో స్థానాన్ని ఇవ్వబోమని చెప్పారు. ఫారాల్లో తప్పుడు సమాచారమిస్తే వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



అనుమసముద్రంపేట: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన అనుమసముద్రంలోని హజరత్ సయ్యద్‌షా ఖాదరీ బాబా దర్గా వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. 60 ఏళ్ల వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ సొమ్మసిల్లారు. దీంతో 108లో ఆత్మకూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు.

పొదలకూరు నిమ్మ ధరలు

పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.8



ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు



మర్రిపాడు: మండలంలోని పొంగూరుమాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాళ్ల ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఎడ్ల బండలాగుడు పోటీలను ఆదివారం నిర్వహించారు. పెద్ద ఎడ్ల బండలాగుడు పోటీల్లో వినుకొండ రఫీ, నారాయణరెడ్డి, ఓబుల్‌రెడ్డి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలను అందజేశారు. చిన్న వాటిలో విజేతలుగా నిలిచిన పుట్టుబోయిన వెంకటేశ్వర్లు, కృష్ణతేజ, మొదేపల్లి అచ్చయ్యకు రూ.15 వేలు, రూ.పది వేలు, రూ.ఐదు వేలను ఇచ్చారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పొగతోటలోని రాయ్ చెస్ అకాడమీలో నిర్వహిస్తున్న అండర్ – 15 సబ్ జూనియర్స్ బాలుర, బాలికల జిల్లా స్థాయి చెస్ చాంపియన్‌షిప్ ఆదివారంతో ముగిసింది. యడవల్లి సాయి చక్రధర్, సంజన గెలుపొందారు. బాలుర విభాగంలో యజ్ఞేశ్వర్‌రెడ్డి, శ్రీచైతన్య, మిథిలేష్.. బాలికల విభాగంలో నేహా, సుదీక్ష, కీర్తన తర్వాతి స్థానాల్లో నిలిచారు. విశాఖపట్నంలో వచ్చే నెల 12, 13న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ చాంపియన్‌షిప్‌లో జిల్లా తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. బహుమతులను కళాలయ డైరెక్టర్ గూడూరు లక్ష్మి, ఆనం పద్మనాభరెడ్డి అందజేశారు. ఆర్బిటర్ మౌనిక, విష్ణు, సుబ్బారెడ్డి, ఫిడే ఇన్‌స్ట్రక్టర్ అజీజ్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు డిమాండ్


మాట్లాడుతున్న నరసింహారావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గత ఎన్నికలకు ముందు కూటమి నేతల హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించడంతో పాటు బకాయిలను వెంటనే చెల్లించాలని భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు డిమాండ్ చేశారు. మినీ బైపాస్‌లోని పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘ నగర మహాసభలో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డును 2007లో అప్పటి సీఎం వైఎస్సార్ హయాంలో ఏర్పాటు చేశారని, దీన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రస్తుతం యత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. అనంతరం 34 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా పెంచలయ్య, శ్రీనివాసులు, ట్రెజరర్‌గా సంపూర్ణమ్మ ఎన్నికయ్యారు. సీఐటీయూ నెల్లూరు నగరాధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చాన్‌బాషా, అల్లాడి గోపాల్, సీఐటీయూ నేతలు కొండా ప్రసాద్, మూలం ప్రసాద్, కత్తి శ్రీనివాసులు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంగళరావునగర్‌లో కార్డన్ సెర్చ్



నెల్లూరు సిటీ: వేదాయపాళెంలోని వెంగళరావునగర్ ఏ బ్లాక్‌లో కార్డన్ సెర్చ్‌ను ఆదివారం తెల్లవారుజామున నిర్వహించారు. ఏఎస్పీ, నలుగురు సీఐలు, నలుగురు ఎస్సైలు, స్పెషల్ పార్టీలతో కలిసి సుమారు 45 మంది పోలీసులు బృందాలుగా ఏర్పడి క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాల్లేని 45 బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు అనుమానితుల నుంచి వేలిముద్రలను సేకరించి కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని వివరించారు. అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఉన్నత పాఠశాలల్లో వసతుల పరిశీలన


ఎంఈఓలకు సూచనలిస్తున్న రామలింగం

ఉదయగిరి రూరల్: ఉదయగిరి, వెంకట్రావుపల్లి ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతులను రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం, జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తరగతులను నూతనంగా నిర్మించిన భవనాలకు మార్చాలని, ఎలక్ట్రికల్ పనులను పూర్తి చేయాలని సూచించారు. దీనికి సంబంధించిన నిధులను వారంలో విడుదల చేస్తామని చెప్పారు. వెంకట్రావుపల్లి ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు నిధులను మంజూరు చేస్తామని వెల్లడించారు. ప్రధానోపాధ్యాయుడు షరీఫ్‌బాషా, ఉదయగిరి ఎంఈఓలు మస్తాన్‌వలీ, తోట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ రవాణా అడ్డగింత

• దాడిలో ఇద్దరికి గాయాలు


చికిత్స పొందుతున్న మనోజ్, మధు

జలదంకి: మండలంలోని జమ్మలపాళెం చెరువులో జేసీబీ సాయంతో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తుండగా, గ్రామానికి చెందిన టీడీపీ నేత సింగమనేని మనోజ్, జనసేన నేత శెట్టిపల్లి మధు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా చెరువు నుంచి ఎలా తరలిస్తారని ప్రశ్నించగా, గ్రామానికి చెందిన నక్కా మాధవ, మహేంద్ర, బాబు, జేసీబీ, ట్రాక్టర్ డ్రైవర్ దాడికి పాల్పడ్డారు. గాయపడిన వారు కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కాగా సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్‌ను సర్పంచ్ అనుమతితో తోలుతుండగా, వారొచ్చి దుర్భాషలాడి దాడికి పాల్పడ్డారని మాజీ సర్పంచ్ నక్కా మాధవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు

ఉదయగిరి: రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని గాయపడిన ఘటన పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న లాస్యప్రియ తన స్నేహితురాలితో కలిసి పట్టణంలోకి వెళ్లి తిరిగి కళాశాలకు బయల్దేరారు. ఈ క్రమంలో పోలేరమ్మ చెట్టు అరుగు వద్ద వెనుక నుంచి వేగంగా బైక్‌పై వస్తున్న నల్లిపోగు దాస్ ఢీకొన్నారు. రోడ్డుపై పడటంతో తీవ్రంగా గాయపడిన ఆమెను ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్సను అందించారు. కాగా యువకుడు మద్యం మత్తులో ఉన్నారని స్థానికులు తెలిపారు. ఎస్సై ఇంద్రసేనారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 33.54 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారానికి 33.54 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2150, పిన్నేరుకు 10, లోలెవల్‌కు 70, హైలెవల్ కు 40, మొదటి బ్రాంచ్ కాలువలకు 85 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.



స్టాఫ్ నర్సు ఆత్మహత్యాయత్నం

• సెల్ఫీ వీడియోలో పలువురిపై ఆరోపణలు


చికిత్స పొందుతున్న లక్ష్మి

ఆత్మకూరు: ఏఎస్‌పేటలోని ప్రాథమిక వైద్యశాలలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న లక్ష్మి ఆత్మహత్యాయత్నానికి ఆదివారం సాయంత్రం పాల్పడ్డారు. ఆస్పత్రి డాక్టర్లతో పాటు 35 మంది సిబ్బంది, డీఎంహెచ్ఓ వేధింపులకు గురిచేస్తున్నారని సెల్ఫీ వీడియోలో ఆరోపించారు. విధులకు హాజరు కాకుండానే పలువురు సిబ్బంది పూర్తి జీతాలు తీసుకున్నారని.. తాను సెలవడిగితే డ్యూటీ డాక్టర్ మంజూరు చేయకుండా వేధించారని పేర్కొన్నారు. వీటిపై అర్జీలను అందించేందుకు కలెక్టరేట్ చుట్టూ కాళ్లరిగేలా తిరిగానని వాపోయారు. కాగా ఈమె, భర్త.. ఏబీఎన్ చానల్ రిపోర్టర్ తీవ్ర వేధింపులకు గురిచేయడంతో అదే పీహెచ్‌సీలో ఎఫ్ఎన్ఓగా పనిచేస్తున్న దొరసానమ్మ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి శుక్రవారం పాల్పడిన విషయం తెలిసిందే. ఈమె ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న స్టాఫ్ నర్సు లక్ష్మి సైతం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి నెల్లూరు తరలించనున్నామని బంధువులు తెలిపారు. కాగా ఈ విషయమై డీఎంహెచ్ఓ సుజాతను సంప్రదించగా, తనకు ఇప్పుడే విషయం తెలిసిందని, పూర్తి స్థాయి విచారణను సోమవారం జరుపుతానని చెప్పారు.